

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

వసతి భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని ట్రిపుల్ ఐటిని శుక్రవారం సందర్శించారు. యూనివర్సిటీలో తాగునీరు, పరిశుభ్రత, హాస్టల్ తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించి అనంతరం చేపట్టిన పనులపై ఆరా తీశారు. అనంతరం సంబంధిత శాఖల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల నాణ్యతలో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ కె.మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ధాన్యం కొనుగోళ్లలో అన్యాయం

- కంచిలి జెడ్‌పిటిసి ప్రతినిధి కృష్ణారావు
- ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడొద్దు
- ధాన్యం కొనుగోళ్లకు ఏం చేశామో తెలుసా?
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు ఉన్నా ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అన్యాయమే జరిగిందంటూ కంచిలి జెడ్‌పిటిసి ప్రతినిధి కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం నియోజవర్గ అభివృద్ధిపై జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖపై చేపట్టిన చర్చ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో దళారుల వల్ల రైతులు నష్టపోయారని చెప్పారు. దీనిపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ బదులిస్తూ కొనుగోళ్లు జరిగిపోయిన తర్వాత ఇప్పుడు మాట్లాడటమేమిటని, ప్రజాప్రతినిధిగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయకుండా ఏం చేస్తున్నావని మండిపడ్డారు. తామేమీ ఇంట్లో కూర్చోలేదని, ధాన్యం కొనుగోళ్ల కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పదిసార్లు మాట్లాడారని, జిల్లాకు చెందిన మంత్రులూ మాట్లాడారని చెప్పారు. ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడొద్దని, అవే వాస్తవాలని పత్రికలు రాస్తాయని చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కింద కేటాయించిన పనులను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున డిసెంబరులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు.

సచివాలయాలు, ఆర్‌బికెలు తదితర ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలకు ఇసుక సమస్య ఉందని, ఎద్దుల బళ్లతో తీసుకొస్తున్న వారిపై కేసులు పెడుతున్నారంటూ కంచిలికి చెందిన ఒక ప్రజాప్రతినిధి ప్రస్తావించారు. థర్డ్ రీచ్‌ల్లో మాన్యువల్ చేసే తవ్వకాలు, రవాణాను ఎవరూ ఆపడానికి లేదని సమావేశంలో నిర్ణయమే ఉత్తర్వులుగా పరిగణించాలని మైన్స్, రెవెన్యూ అధికారులకు చెప్పారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి, కంచిలి మండలాల్లోని పలు గ్రామాలకు కొత్త రోడ్ల నిర్మాణం కోసం తవ్వేసి వదిలేశారని, మూడేళ్లవుతున్నా రోడ్లు వేయలేదంటూ ఆయా నియోజకవర్గాల స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సోంపేట మండలం ఇసకలపాలెం నుంచి ఎర్రముక్కాం వరకు ఉన్న తీరంలో మత్స్యకారులకు కోల్డ్ స్టోరేజీ నిర్మించాలని చెప్పారు. మండలంలో మత్స్యకార సామాజిక తరగతికి చెందిన 11 మంది ఎంపిటిసిలు, తొమ్మిది మంది సర్పంచ్‌లు ఉన్నా కోల్డ్‌స్టోరేజీ తీసుకు రాలేకపోయామని, అవమానంగా ఉందంటూ సోంపేటకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధి వాపోయారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని పలు పిహెచ్‌సిలు, యుహెచ్‌సిల్లో వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. దీనిపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చినా రావడం లేదని, బలవంతంగా నియమిస్తే సెలవు పెట్టి వెళ్లిపోతున్నారని చెప్పారు. మంత్రి బొత్స జోక్యం చేసుకుంటూ స్థానికంగా ఉన్న వారు ఎవరైనా పనిచేయడానికి ఆసక్తి చూపిస్తే ఉత్తర్వులు ఇస్తామని బదులిచ్చారు.


మాట్లాడుతున్న కంచిలి జెడ్‌పిటిసి ప్రతినిధి కృష్ణారావు

సంక్షేమ కార్యక్రమాల అమల్లో లోపమే గత ప్రభుత్వ వైఫల్యం

సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో గత ప్రభుత్వం వైఫల్యం చెందిందని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రాజకీయాలకు తావు లేకుండా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చూసేందుకే ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు వేస్తోందన్నారు. తమకు తెలియకుండా లబ్ధిదారుల ఎంపిక చేసేస్తున్నారంటూ నాయకులు, కార్యకర్తలు బాధపడి ఉండొచ్చని, ప్రభుత్వం అమలు చేసిన విధానం వల్ల గౌరవం పెరిగిందని చెప్పారు. అందరూ సమిష్టిగా పనిచేసి ప్రజల అభిమానం పొందేలా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జూన్‌లో బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు, హెచ్‌ఎంలకు పెండింగ్ జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 12 నాటికి బదిలీలు, జూన్ 25 నాటికి పలు కేడర్ల ప్రమోషన్స్ ప్రక్రియ పూర్తయినా, కేడర్ అప్‌డేట్ పేరిట ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడం సరికాదన్నారు. బదిలీల ప్రక్రియను యుద్ధప్రాతిపదికన నిర్వహించామని చెప్పిన విద్యాశాఖ జీతాలు సకాలంలో చెల్లించడంలో విఫలమైందన్నారు. జీతాల మీద ఆధారపడే ఉపాధ్యాయులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. జీతాలు చెల్లింపులు త్వరగా చేపట్టాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.దమయంతి, సీనియర్ నాయకులు పి.ధర్మారావు, యు.అప్పలసూర్యనారాయణ, పి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

పట్టణ ప్రాంతాల్లో సమగ్ర భూ సర్వే

రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్ పి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలతో పాటు పట్టణ ప్రాంతాల్లో సమగ్ర భూ సర్వే నిర్వహించనున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్ పి.కోటేశ్వరరావు వెల్లడించారు. ఇందులో భాగంగా 123 మున్సిపాల్టీల్లో యుద్ధప్రాతిపదికన సమగ్ర భూ సర్వే చేపట్టనున్నట్లు చెప్పారు. జగనన్న భూ హక్కు- భూ రక్ష చట్టంపై జిల్లాలోని మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న సర్వేయర్లు, ఇతర సిబ్బందికి నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో శిక్షణా తరగతులను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వేలో ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టడమైందని, ఇకపై పట్టణ ప్రాంతాల్లో ప్రారంభం కానుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు ఇది ఎంతగానో తోడ్పడతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న భూముల సర్వే సమర్థవంతంగా నిర్వహించి లబ్ధిదారులకు భూహక్కు పత్రాలను అందిస్తామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సమగ్రంగా భూ సర్వే చేపట్టి పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారికి భూ హక్కు పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి సర్వే నంబరుకు హద్దులు నిర్ణయించి డ్రోన్ కెమెరాల సహాయంతో మ్యాపులు తయారు చేసి ఎవరికీ అన్యాయం కాకుండా న్యాయం చేస్తామన్నారు. మున్సిపాల్టీ, వార్డు సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న సదస్సులు జిల్లా నుంచి ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, అర్బన్ రీసర్వే ప్రత్యేక అధికారి బి.సుబ్బారావు, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అదనపు డైరెక్టర్ ప్రభాకరరావు, జిల్లాలోని మున్సిపాల్టీల కమిషనర్లు, రెవెన్యూ, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్ కోటేశ్వరరావు

అర్హులైన ఓటర్లను తొలగిస్తే చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చేపడుతున్న ఓటర్ల ప్రత్యేక నమోదులో ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావుండకూడదని, అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హెచ్చరించారు. ఇఆర్‌ఒ, ఎఇఆర్‌ఒలతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదులో అర్హులైన ప్రతిఒక్కరి పేరు నమోదు కావాలన్నారు. బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్న సమయంలో వాలంటీర్లను ఉపయోగించుకున్నా, వెంట తీసుకెళ్లినా చర్యలు తప్పవన్నారు. 18 ఏళ్లు నిండిన ఓటర్లతో పాటు మార్పులు, చేర్పులు చేసుకున్న ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎపిక్ కార్డులను మంజూరు చేయాలని ఆదేశించారు. ఫారం 6, 7, 8ను పూరించే సమయంలో అవసరమైన ధ్రువపత్రాలను తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్తగా నమోదైన ఓటర్లతో పాటు సవరణ జరిగిన, తొలగించిన ఓటర్ల వివరాలను అన్ని రాజకీయ పార్టీలకు అందజేసి, సంతకాలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో సమస్యలు తలెత్తితే ఇఆర్‌ఒ, జిల్లా ఎన్నికల అధికారిని సంప్రదించాలన్నారు. ఓటర్ల ఫారం-6, 7, 8తో పాటు సంబంధిత ఆధారాలను ఫారం 13, 14 నోటీసులను ఇఆర్‌ఒ కార్యాలయంలో భద్రపరచాలని సూచించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఉన్న 17 నుంచి 20 మధ్య గల వయస్కుల వారిని నమోదు చేయాలన్నారు. తీసుకున్న దరఖాస్తులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలన్నారు. ఎపిక్ కార్డులను ఎప్పటికప్పుడు ప్రింట్ చేసి ఓటర్లకి చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బిఎల్‌ఒ ఇంటింటి సర్వేను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని తద్వారా ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు వినియోగించుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జి.జయదేవి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జీడికి మద్దతు ధరతోనే అభివృద్ధి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - సోంపేట

ఉద్దానం జీవనాడి జీడి అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. జీడికి మద్దతు ధర కల్పించడం ద్వారానే ఉద్దానం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. సోంపేటలో శుక్రవారం నిర్వహించిన సిపిఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. జీడి రైతుకు మద్దతు ధర ఇవ్వడం వల్ల జీడిపంట విస్తారంగా పండితే దానిపై ఆధారపడిన జీడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని, వేలాది మంది కార్మికులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. మద్దతు ధర ఇవ్వడం వల్ల ఉద్దానం అభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి ముడిపడి ఉందన్నారు. జీడికి మద్దతు ధరపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరపై స్థానిక మంత్రి సీదిరి అప్పలరాజు మౌనం వీడి మాట్లాడాలని డిమాండ్ చేశారు. జీడి సమస్యపై జిల్లాలో మంత్రులకు పట్టదా అని ప్రశ్నించారు. జీడి మద్దతు ధరపై టిడిపి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు ఇవ్వాలని, ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. స్థానిక జీడిపిక్కలను కొనుగోలు చేసిన తర్వాతే విదేశీ జీడిపిక్కల దిగుమతికి అనుమతి ఇవ్వాలన్నారు. జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, జీడి రైతులకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జీడి రైతులు చేస్తున్న పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పాతిన కృష్ణమూర్తి, నాయకులు సంగారు లక్ష్మీనారాయణ, కె.సింహాచలం, జుత్తు సింహాచలం, దుబ్బ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

కలెక్టరేట్ వద్ద పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, ఇతర కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.అరుణ్ కుమార్ విమర్శించారు. బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పంచాయతీ కార్మికుల నియామకంలో టెండర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 57, 132, 680 జిఒలను అమలు చేయాలని, టెండర్ల విషయంలో హైకోర్టు తీర్పును అమలు చేయాలని 010 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. గ్రామాలను పరిశుభ్రం చేస్తూ ప్రజారోగ్యం, పర్యావరణాన్ని కాపాడుతూ చాలీచాలని వేతనాలతో బతుకీడుస్తున్న కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 551 జిఒ ప్రకారం పంచాయతీ కార్మికులకు గుర్తింపుకార్డులు, కనీస వేతనాలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ, టెండర్ల విధానాన్ని అమలు చేయాలని చెప్పినా వాటిని అమలు చేయడం లేదన్నారు. కరోనా కాలంలో గ్రామ పంచాయతీ కార్మికులు ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారని గుర్తుచేశారు. మోడీ ప్రభుత్వం కరోనాలో ప్రాణాలు కోల్పోయిన ఫ్రంట్‌లైన్ వర్కర్ల కుటుంబాలకు రూ.50 లక్షలు ఇస్తామని ఉత్తర్వులు జారీ చేసినా ఇంతవరకు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం గద్దెనెక్కి నాలుగేళ్లు అవుతున్నా గ్రామపంచాయతీ కార్మికులు ఆశలు తీర్చక పోగా ఇచ్చిన జిఒలను సైతం అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే చలో విజయవాడకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు పడాల ప్రసాదరావు, గూన కృష్ణారావు, సిహెచ్.నూకరాజు, ఎన్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి

క్రీడలతోనే మానసికోల్లాసం

శ్రీకాకుళం అర్బన్ : నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే న్యాయవాదులు, జిల్లా కోర్టు సిబ్బందికి క్రీడలు ఎంతో మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టులో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఒకటో అదనపు జిల్లా జడ్జి కె.శ్రీదేవి క్రీడా జ్యోతిని వెలిగించి న్యాయవాదులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించేందుకు న్యాయవాదులు ప్రతిరోజూ వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు మాట్లాడుతూ న్యాయవాదుల్లో, కోర్టు సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపేందుకే ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ, వాలీబాల్, క్యారం బోర్డు, క్రికెట్ తదితర క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించే ఈ పోటీల్లో సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది విజయవంతం చేయాలని కోరారు.

కవాతుతోనే క్రమశిక్షణ

ఎచ్చెర్ల : కవాతుతోనే పోలీస్ సిబ్బందిలో క్రమశిక్షణ, ఐకమత్యభావం కలుగుతుందని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు మైదానంలో శుక్రవారం నిర్వహించిన పోలీసు పరేడ్‌ను పరిశీలించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం నాడు మరింత ఉత్సాహంగా పరేడ్ ప్రదర్శన చేయాలన్నారు. పోలీసు శాఖలో సిబ్బందికి క్రమశిక్షణ ముఖ్యమన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆర్మ్‌డ్, సివిల్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది సమస్యలపై గ్రీవెన్స్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు వై.శృతి, ఎస్.బాలరాజు, జి.వి ప్రసాదరావు, డి.విజయకుమార్, ఎస్.వాసుదేవ్, డి.ప్రసాదరావు, ఆర్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులు వేగవంతం

ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజలకు ఒకేచోట పాలనా సేవలు అందించేందుకు వీలుగా రూపుదిద్దుకున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. మూడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపడుతున్న నిర్మాణ పనులు పూర్తి దశకు చేరినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆర్థిక మంత్రికి వివరించారు. మౌలిక సదుపాయాల పనుల పూర్తికి మరో ఐదు నెలలు పడుతుందని కాంట్రాక్టర్ తెలిపారు. మొత్తం భవన సముదాయంలో ఆర్థిక మంత్రి కలియ తిరుగుతూ మిగిలిపోయిన పనులకు సంబంధించి ఏ పనులను ఎలా చేయాలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.145 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌తో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోటకు రానున్నాయని తెలిపారు. పెండింగ్ బిల్లులు అన్నీ పూర్తి చేశామని, త్వరలోనే మిగిలిన స్వల్ప మొత్తాన్ని కూడా విడుదల చేస్తామన్నారు. సీలింగ్, ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ పనులు, ఎసిల ఏర్పాటు వంటి పనులు అనుభవజ్ఞులైన అధికారుల సమక్షంలో జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఆర్థికశాఖ కార్యదర్శి ఎస్.ఎస్ రావత్, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక మంత్రికి పనుల ప్రగతిని వివరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్


వంటల ప్రదర్శనను పరిశీలిస్తున్న జెసి నవీన్

రేషన్ బియ్యంపై అపోహలు వద్దు

వంటకాల ప్రదర్శనను పరిశీలించిన జెసి నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రేషన్ బియ్యంపై ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని జెసి ఎం.నవీన్ అన్నారు. కలెక్టరేట్‌లో ప్రజా పంపిణీ బియ్యంతో మహిళలు చేసిన వంటకాలతో జిల్లా పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యాన వంటల పోటీలు, ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. వివిధ రకాల వంటకాలను మహిళలు తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా జెసి పాల్గొని వంటకాలను రుచి చూసి, వాటిని తయారు చేసిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేస్తోందన్నారు. రేషన్ బియ్యంతో సక్రమంగా వంట తినలేమని, తిన్నా సక్రమంగా జీర్ణం కాదనే అవాస్తవ ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. రేషన్ బియ్యం నాణ్యత, పోషక విలువలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో జిల్లా స్థాయిలో వంటల పోటీలు పౌర సరఫరాల శాఖ నిర్వహించినట్టు తెలిపారు. ఈ బియ్యంతో పులిహోర, పరమాన్నం వంటి సంప్రదాయ వంటలే కాకుండా అరిసెలు, మురుకులు, దోసెలు, గోంగూర రైస్, చలివిడి వంటి అనేక వినూత్నమైన వంటకాలు చేయవచ్చని ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు వివరించారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన ఎస్.మనిమాల ప్రశంస పత్రంతో పాటు రూ.4 వేల నగదు బహుమతి, రెండో స్థానంలో నిలిచిన ఎం.శ్రావణిశ్రవణ్, ఎన్.శారదలకు రూ.3 వేలు చొప్పున, మూడో స్థానం కైవసం చేసుకున్న దేవవాని, పి.తులసి, ఎం.మణి రూ.2 వేలు చొప్పున, నలుగురికి కన్సలేషన్ రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటరమణ, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ టిడి గోపాల్, ఆర్ఐ శ్రీనివాస్, షరీఫ్, సాయి, సిద్ధు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- పొందూరు

ఉపాధ్యాయులందరూ తమ సంఘాలకు అతీతంగా పోరాటాలను సాగిస్తేనే ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం దిగివస్తుందని ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ అనిల్‌కుమార్, మండల అధ్యక్షులు మొగదాల రమణరావు అన్నారు. మండలంలోని తోలాపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎపిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభజించు, పాలించు పద్ధతిలో ఉపాధ్యాయ సంఘాల మధ్య చీలిక తీసుకొచ్చి ప్రభుత్వం లబ్ధిపొందాలని చూస్తుందని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు సంఘాలన్నీ ఒక్కటిగా కలిసి ప్రభుత్వ దురాగతాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.విజయ్‌కుమార్, నాయకులు డి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులు వేగవంతం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

ఉపరితల జలాల లభ్యత లేని ప్రాంతాల్లో భూగర్భ జలాలను వినియోగించుకునే లక్ష్యంతో జల జీవన్ మిషన్ కార్యక్రమానికి అంకురార్పణ ప్రభుత్వం చేపట్టిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గుత్తావల్లిలో రూ.1.14 లక్షలు, లాభాంలో రూ.69 లక్షలు, నారాయణపురంలో రూ.38 లక్షల అంచనాలతో జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికి తాగునీటి కుళాయిల పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. గుత్తావల్లిలో సమగ్ర భూ సర్వే పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. లాభాంలో గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ పోషకాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం పెంచడానికి విలేజ్ వాటర్ శానిటేషన్ కమిటీని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందులో 25 శాతం మహిళలు, వార్డు మెంబర్లకు 50 వెనకబడిన తరగతుల వారికి సభ్యులుగా అవకాశం కల్పించనున్నారని తెలిపారు. వీరికి అవసరమైన శిక్షణ ఇచ్చి తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, వాటి సమగ్ర వినియోగంపై దృష్టి సారించేలా చూడటమే దీని లక్ష్యమని అన్నారు. ప్రతి గ్రామంలోనూ జల జీవన్ మిషన్ పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డిసిసిబి డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

పొందూరు: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కింతలిలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ... ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, తహశీల్దార్ వై.వి.ప్రసాదరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్ పాల్గొన్నారు.


బూర్జ : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

రౌడీ రాజ్యం పోవాలి

టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో రౌడీ రాజ్యం పోయి ప్రజాస్వామ్యం రావాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. చిత్తూరు జిల్లా పొంగనూరులో మాజీ సిఎం చంద్రబాబు పర్యటనపై జరిగిన రాళ్ల దాడికి నిరసనగా శుక్రవారం టిడిపి నాయకులు ఆందోళన చేపట్టారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి వన్‌వే కూడలి గాంధీ విగ్రహం వరకూ కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం చుట్టూ టిడిపి నాయకులు, కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభద్రతాభావంతో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి దాడులకు దిగడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తుందని, ఈ ప్రభుత్వం పోయి అంబేద్కర్ రాజ్యాంగం రావాలని అన్నారు. వైసిపి కార్యకర్తలు రెచ్చిపోతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం సమంజసం కాదని హితవుపలికారు. చంద్రబాబుపై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు మెట్ట సుజాత, కణితి విజయలక్ష్మి, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, అన్నెపు భాస్కరరావు, అంబల్ల రాంబాబు, పల్లి సురేష్, బోర గోవిందరావు, సంపదరావు మురళి పాల్గొన్నారు.


ఆమదాలవలస : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

శ్రీకాకుళం రూరల్ : చంద్రబాబుపై రాళ్ల దాడి ప్రజాస్వామ్యానికే కళంకమని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. రాళ్ల దాడి చేయడాన్ని ఖండిస్తూ ఇందుకు కారకులైన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

టెక్కలి : చంద్రబాబుపై జరిగిన దాడి హేయమైన చర్య అని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో ఆట్లాడారు. పుంగనూరులో జరిగిన ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, మట్ట పురుషోత్తం, మామిడి రాము,కోళ్ల లవకుమార్, దల్లి ప్రసాద్‌రెడ్డి, ప్రీతీష్‌చంద్, మల్లిపెద్ది మధు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐలు

ప్రజాశక్తి- పలాస

అమృత్ భారత్ పథకంలో భాగంగా పలాస రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆదివారం రూ.23.85 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఈ ఏర్పాట్లను కాశీబుగ్గ సిఐ జి.శ్రీనివాసరావు, రైల్వే సిఐ వెంకటరావు, ఆర్‌పిఎఫ్ సిఐ స్యాముల్ శుక్రవారం పరిశీలించారు. రైల్వే స్టేషన్ వద్ద అమృత్ భారత్‌కు సంబంధించి స్టేషన్‌లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలో చేపట్టనున్న శంకుస్థాపన వీడియోను పలాసలో ప్రదర్శిస్తామని రైల్వే అధికారులు తెలిపారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, రైల్వే ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరుకానున్నారు.

కోటిపల్లి సచివాలయ కార్యదర్శి సస్పెన్షన్

పొందూరు: మండలంలోని కోటిపల్లి సచివాలయం కార్యదర్శి జి.రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి శుక్రవారం ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపిడిఒ సీపాన హరిహరరావు తెలిపారు. పంచాయతీకి సంబంధించి ఇంటి పన్నుల వసూళ్లు పంచాయతీ ఖాతాలో జమచేయకుండా తమ సొంత అవసరాలకు వినియోగించుకున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ గురుగుబెల్లి సుధారాణి కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారని అన్నారు. దీనిపై కలెక్టర్ ఆదేశాలు మేరకు మే 22న డిఎల్‌పిఒ పంచాయతీలో విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారని అన్నారు. దీంతో నిధులు దుర్వినియోగం వాస్తవమని తేలడంతో ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు అందినట్లు తెలిపారు.

నేడు ఉపాధ్యాయుల ధర్నా

రణస్థలం ఈనెల 5న జిల్లాలో అన్ని మండలాల తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఒక్కరోజు ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని అన్నారు. దశలవారి కార్యక్రమంలో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐక్య ఉద్యమాల ద్వారానే ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని అన్నారు.

ప్రతిభకు పురస్కారం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉత్తమ డిసిసిబిగా ఎంపికైంది. ఆప్కాబ్ సేవలను ఎక్కువగా వినియోగించుకుని ప్రజలకు చేరువ చేయడంలో కృషి చేసిన డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, సిఇఒ ప్రసాదరావులు శుక్రవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సిఎం జగన్మోహనరెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

మాజీ డ్రైవర్‌పై రెచ్చిపోయిన వాణి

టెక్కలి రూరల్ : టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి తన మాజీ డ్రైవర్ నాగేంద్రపై అసభ్య పదజాలంతో రెచ్చిపోయారు. అయితే తన దగ్గర డ్రైవర్‌గా మానేసి మరొక వైసిపి నాయకులు దగ్గర డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న విషయాన్ని అక్కడ చెప్తున్నారని అసభ్య పదజాలంతో ఫోన్‌లో రెచ్చిపోయారు. నీవు ఏమనుకుంటున్నావ్... కుందకు కట్టేసి గ్రామస్తులతో కొట్టిస్తా జాగ్రత్తగా అంటూ బెదిరించారు. మీరు చెప్పిందే చెప్పానని, అంతకంటే నేను ఏమి చెప్పలేదని చెప్తున్నప్పటికీ పట్టించుకోకుండా మాట్లాడారు. ఈ వాయిస్ రికార్డుపై టెక్కలి ప్రజలకు చర్చనీయాంశమైంది.

ఎఒగా శ్రీనివాసరెడ్డి

'ప్రజాశక్తి' కథనానికి స్పందన


శ్రీనివాసరెడ్డి, ఎఒ

కవిటి: కవిటి మండల పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారిగా (ఎఒ) కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జూలై 28న 'వేధిస్తున్న సిబ్బంది కొరత' అంటూ 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ఇచ్ఛాపురం పిఆర్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ... ఎఒగా ప్రభుత్వం నియమించింది. ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న గడ్డెమ్మ

'కాపునేస్తం' దరఖాస్తులు పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు తప్పక అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయని, క్షేత్ర స్థాయిలో ఎక్కడా లోపాలకు తావులేకుండా సచివాలయ ఉద్యోగులు సేవలందించాలని బిసి కార్పొరేషన్ ఇడి ఆర్ గడ్డెమ్మ సూచించారు. నగరంలోని అరసవల్లి-గూనపాలెం రోడ్డు, రాగోలు-1 సచివాలయాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాపు నేస్తం పథకం కింద వస్తున్న దరఖాస్తులను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ మార్గ దర్శకాలను తప్పక పాటించాలనిని సూచించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు.


మాట్లాడుతున్న గౌతు శిరీష

ఓటరు నమోదును పరిశీలించాలి

ప్రజాశక్తి- పలాస

రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న ఓటరు నమోదు సర్వేను టిడిపి నాయకులు పరిశీలించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం పలాస, వజ్రపుకొత్తూరు, మందస, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ టిడిపి నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటికే అధికార పార్టీ నాయకులు టిడిపి ఓట్లను తీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఓట్లనే లక్ష్యం చేస్తూ... తొలగించే ప్రయత్నంలో ఉన్నారని, అటువంటి వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అప్పన్న, రాబిన్ శర్మ, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, నవీన్, వడ్డీ యాదగిరి, దువ్వాడ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉచిత న్యాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చట్టం ముందు అందరూ సమానమేనని, అయితే ఆర్థికంగా నిరుపేదలకు న్యాయం అందించాలన్న లక్ష్యంతో ఉచితంగా పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా అందిస్తున్నామని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ జి.సువర్ణరాజు తెలిపారు. నగరంలోని డిఆర్‌డిఎ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రజా ప్రయోజన సేవలు పొందేందుకు ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కోర్టు ద్వారా ఉచిత న్యాయ సలహాలు పొందడానికి వీలుందన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

మృతుని వివరాలు లభ్యం

టెక్కలి రూరల్ : టెక్కలి మండలం పెద్దరొకళ్లపల్లి సమీపంలో గురువారం రైలు ఢీకొని మృతి చెందిన వ్యక్తి వివరాలు శుక్రవారం లభ్యమయ్యాయి. మృతుడు టెక్కలి మండలం కొండభీంపురానికి చెందిన కర్రి మల్లేశ్వరరావు(51)గా జిఆర్‌పి పోలీసులు గుర్తించారు. ఈ మేరకు శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యార్థినుల గాలింపునకు మూడు బృందాలు

బూర్జ : మండలంలోని కొల్లివలస కెజిబివి విద్యార్థుల ఆచూకీ కోసం మూడు బృందాలను పంపించినట్లు ఎస్ఐ అశోక్‌బాబు శుక్రవారం తెలిపారు. అదృశ్యమైన తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్, విజయవాడ ఈ బృందాలను పంపించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ అధికారి, ఎస్ఒ పాఠశాలను సందర్శించారు.

ఆర్థిక మంత్రి దృష్టికి ప్రజా సమస్యలు

ఇచ్ఛాపురం: నియోజకవర్గంలో నెలకొన్న పలు ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీడాప్ చైర్మన్ చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి వచ్చిన ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీకి సమీపం బహుదా నదిపై గల వంతెన ఈ ఏడాది మే 17న కూలిపోయిందని అన్నారు. ఈ నదిపై కొత్త వంతెన నిర్మాణానికి సంబంధిత రోడ్లు, భవనశాఖకు ఆర్థికపరమైన అనుమతుల ఫైల్‌ను పంపించాలని కోరారు. అలాగే పిడుగుపాటుకు గురై మృతి చెందిన మహిళా వాలంటీర్, వైసిపి నాయకుడు కుటుంబానికి డిజాస్టర్ మానేజ్‌మెంట్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. 2007లో రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన గంగసాగరం మినీ రిజర్వాయరు పనులు 40 శాతం పూరయ్యాయని, దీనికి నిధులు మంజూరు చేసి పనులు చేయాలని కోరారు. దీంతో సోంపేట, కంచిలి మండలాలలో 1200 ఎకరాలకు నీరు రెండు పంటలకు సాగునీరు అందుతుందని అన్నారు.

వైసిపిలో ముసలం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి వైసిపిలో ముసలం పుట్టుకొచ్చింది. ఉన్నట్టుండి మండల అధ్యక్షుడు మార్చాలంటూ 21 మంది సర్పంచ్‌లు, 12 మంది ఎంపిటిసిలు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణికి తమ అభిప్రాయాన్ని తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి పైనే దుర్భాషలాడిన ప్రస్తుత మండల వైసిపి అధ్యక్షుడు కోత సతీష్‌ను తప్పించాలని కోరారు. ఆయన స్థానంలో మూలపేట సర్పంచ్ జీరు బాబూరావును నియమించాలని సంతకాలు సేకరణ చేశారు. అలాగే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణకు, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌లను కలిసి కూడా వినతిపత్రం అందజేశారు. తెలుగుదేశం సంతబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడుగా మూలపేట మాజీ సర్పంచ్ జీరు భీమారావు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


కొనసాగుతున్నారని అన్నారు. అయితే అదే గ్రామం నుంచి వైసిపి మండల పార్టీ అధ్యక్షునిగా జీరు బాబూరావును నియమిస్తే బాగుంటుందని వివరించారు. దీంతో మండల రాజకీయాలు ఒకసారిగా వేడెక్కాయి.

6న జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

ఆట్యా పాట్యా సంఘం ఆధ్వర్యాన అండర్-16 బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక ఈ నెల 6న టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ర్వహిస్తున్నామని జిల్లా సమన్వయకర్త బాడాన నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2006కు ముందు జన్మించిన వారు అర్హులని అన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత ధ్రువపత్రాలతో మైదానానికి చేరుకోవాలన్నారు. ఎంపికైన జిల్లా జట్టు ఈ నెల 20న కర్నూలులో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 8500007272 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


పుస్తకాలను అందిస్తున్న శ్రీనివాసరావు

కవిటి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దూగానపుట్టుగలోని గ్రంథాలయం మెదటి వార్షికోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గ్రామంలో ఇటువంటి గ్రంథాలయం ఏర్పాటు చేసి ఎంతోమంది యువతకు బాసటగా నిలిచిన దూగాన తిరుపతిరావుని అభినందించారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచిన గ్రామానికి చెందిన విద్యార్థులు దూగాన శైలు, మరిడి ధరణి, దూగాన ఇందులను మెమొంటో, బహుమతులు అందజేశారు. అనంతరం గ్రంథాలయం అభివృద్ధిలోకి తనవంతుగా రూ.15 వేలు విలువైన పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందజేశారు. అనంతరం శ్రీనివాసరావు, ప్రతినిధులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ దూగాన భద్రాచలం, రోటరీ క్లబ్ ప్రతినిధులు పి.వి.కృష్ణారావు, బెనర్జీ పాల్గొన్నారు.

రైతుల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తా

ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు తిరుపాల్ రెడ్డి


మాట్లాడుతున్న తిరుపాల్‌రెడ్డి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతుల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఐ.తిరుపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకొని దానికి అనుగుణంగా ఎరువులను వాడుకొని సాగు ఖర్చును తగ్గించుకోవాలన్నారు. వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందాలని అన్నారు. రైతుల సమస్యలను తెలియజేసినట్లయితే ప్రభుత్వ సలహాదారుగా తగు నివేదికలో ప్రభుత్వానికి అందజేస్తానని అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తల బృందం చేపడుతున్న కార్యక్రమాల వివరాలను ఆయనకు కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి వివరించారు. అనంతరం అభ్యుదయ రైతులు వ్యవసాయ యంత్రాలను ప్రభుత్వ రాయితీపై వ్యక్తిగతంగా కొనుగోలు చేయడానికి అవకాశాలను కల్పించాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయం మిషన్ సభ్యుడు గుండు రఘురాం, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డాక్టర్ సమ నేతాజీ, జిల్లా సంయుక్త వ్యవసాయ అధికారి డాక్టర్ శ్రీధర్, వ్యవసాయ పరిశోధన స్థానం రాగోలు అధిపతి డాక్టర్ పి.వి.సత్యనారాయణ, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

ఈ నెల 10న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హిరమండలం, కొత్తూరు మండలాలోల పర్యటిస్తున్నారని, ఈ పర్యటను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో కొత్తూరు, కుంచాలపేటలో క్లస్టర్ టిడిపి కార్యకర్తలతో, నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులు విధ్వంస కార్యక్రమంలో భాగంగా ఈ నెల10న హిరమండలం, కొత్తూరుల్లో చంద్రబాబు పర్యటిస్తున్నారని తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, మండల కన్వీనర్ పి.మోహనరావు, సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, బి.గోవిందరావు, అగతముడి అరుణ్‌కుమార్, పి.అమర్, సిహెచ్.లోకేష్, ఎం.కృష్ణ, జి.కమలాకర్, వై.కన్నంనాయుడు, రాజారావు, అచ్యుతరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ

జాబ్ కేలండర్ ఏదీ?

టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫోస్టో ప్రకారం జాబ్ కేలండర్‌ను ప్రకటించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్ కోరారు. శుక్రవారం టెక్కలి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు సిఎం జగన్ నిర్వహించిన పాదయాత్రలో అధికారంలోకి రాగానే లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఒక్క సచివాలయం తప్ప మిగతా పోస్టులకు నోటీఫికేషన్ విడుదల చేయలేదని పేర్కొన్నారు. అనంతరం టెక్కలి కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షునిగా కిరణ్, కార్యదర్శిగా కృష్ణ, సహాయ కార్యదర్శులుగా నరేష్, మాధవరావు, ఉపాధ్యక్షులుగా భాస్కరరావు, కోశాధికారిగా నాయుడులను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘ సభ్యులు కొన్న శ్రీనివాసరావు, రాము, కర్ణ, పవన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


జలుమూరు : కిట్లను అందజేస్తున్న ఎంపిపి గోపి

ప్రజాశక్తి- జలుమూరు

మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి రోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డలు జన్మిస్తారని ఎంపిపి వాన గోపి అన్నారు. మండలంలోని చల్లవానిపేట సచివాలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టేక్ హోమ్ రేషన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణికులకు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, వైసిపి నాయకులు పొన్నాన విజయ్‌కుమార్, చిన్నాల మురళి, అంగన్వాడీ సూపర్‌వైజర్ సీతారత్నం పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని భైరిపురంలో గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య పంపిణీచేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పుల్లట జగదీష్, సనపల శ్రీను, పి.శంకరరావు పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలో వల్లభరావుపేట పంచాయతీలో సంపూర్ణ పోషణ కిట్లను సచివాలయం కన్వీనర్లు గురాన మానస, మహంతి సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొంతు నర్సింహామూర్తి, పిల్ల వెంకటరమణ, పిల్ల గణపతి, గడి గణపతి, గడి బాబూరావు, వాసుదేవరావు, సూర్యారావు పాల్గొన్నారు.

పలాస : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రమేష్‌నాయుడు, ఎంఇఒ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి డి.శార్వాణిలు సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సునీల్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు యు.లత, ఎస్.సరస్వతి, పి.గంగమ్మ, సిహెచ్.దానమ్మ, ధనలక్ష్మి, అరుణకుమారి, దున్న సునీత పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని వల్లభరావుపేట అంగన్వాడీ కేంద్రంలో గర్భిణుకు, బాలింతలకు సచివాలయం కన్వీనర్లు గురాన మానస, చిరంజీవి, మహంతి సత్యనారాయణ సంపూర్ణ పోషక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమణ, పాలూరి బుజ్జి, బొంతు నర్సింహామూర్తి, పిల్ల వెంకటరమణ, పిల్ల గణపతి, గడి గణపతి పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని బొప్పాయిపురం అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ గుజ్జ మోహన్‌రెడ్డి సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, డిడిఒ పాల వసంత రెడ్డి వర్ధన్, కార్యకర్త పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని పట్టుపురంలో సర్పంచ్ మెట్ట ఈశ్వరమ్మ, బూత్ కన్వీనర్ మట్టి సింహాచలంలో సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు.


కవిటి : కిట్లను అందజేస్తున్న నీలయ్య


సన్మానిస్తున్న ఎస్‌పి రాధిక

విశ్రాంత హోంగార్డుకు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పోలీసు హోంగార్డు యూనిట్‌లో సుదీర్ఘం కాలం పనిచేసి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన సిహెచ్.జగదీశ్వరరావును ఎస్‌పి జి.ఆర్.రాధిక శుక్రవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఆయనకు తక్షణ ఆర్థిక సాయంగా రూ.5 వేలు చెక్కును అందజేశారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేశారని, సుదీర్ఘకాలం పాటు కేటాయించిన అన్ని విధులు చక్కగా నిర్వర్తించడం అభినందనీయమని అన్నారు. అలాగే జిల్లాలోని హోంగార్డులు స్వతహాగా విరాళంగా ఇచ్చిన ఒక రోజులు వేతనం రూ.4.45 చెక్కును ఇటీవల మృతి చెందిన హోంగార్డు ఎస్.వి.తారకేశ్వరరావు సతీమణికి అందజేశారు. శాఖపరమైన ప్రయోజనలు త్వరితగతిన వచ్చేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వర్, జె.తిపేస్వామి, ఎఒ గోపినాథ్, ఆర్‌ఐలు బి.ప్రేదీప్ పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న మంత్రి సతీమణి శ్రీదేవి

ప్రతి గ్రామానికీ రవాణా సౌకర్యాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతి గ్రామానికీ రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సతీమణి శ్రీదేవి అన్నారు. మండలంలోని కొండపల్లిలో కొండపల్లి-పలాస ఆర్‌టిసి బస్ సేవలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక మంత్రి చొరవతో ప్రజల కల నెరవేరిందన్నారు. బస్ సౌకర్యం లేక నిత్యం ఎలుగుబంట్లు బెడదతో స్వగ్రామం ప్రయాణం చేయాలంటే ఇబ్బంది పడే ప్రజలకు బస్ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. స్థానికులు ప్రభుత్వ బస్ సేవలు ఉపయోగించుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దాసరి పాపారావు, వైస్ సర్పంచ్ మడ్డు జస్వంత్, డిపో మేనేజర్ పాల్గొన్నారు.

మోహన్‌కు ఉత్తమ 'సెనేటర్' పురస్కారం

శ్రీకాకుళం అర్బన్ : జెసీస్ సంస్థ ద్వారా మూడు దశాబ్దాలుగా ఉత్తమ సేవలందిస్తూ సెనేటర్‌గా నిరంతరం సంస్థ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నటుకుల మోహన్‌కు ఉత్తమ సీనియర్ సెనేటరు పురస్కారం లభించింది. గోవాలోని రాడిసన్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన జెసిఐ జాతీయ అధ్యక్షులు కార్తికేయన్, సెనేట్ చైర్మన్ అనూష్ షరాఫ్ చేతుల మీదుగా ఉత్తమ సెనేటర్ యుఎస్ఎ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ జెసిఐ ద్వారా కొన్నేళ్లుగా యువతకు, మహిళలకు పలు రంగాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దామన్నారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బూర్జ : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం మన చెంత ఉంటుందని గుత్తావెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రోజా అన్నారు. ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అందుకు ప్రతిఒక్కరూ తమ పరిసర ప్రాంతాల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మజ్జి వెంకట అప్పలనాయుడు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వేర్‌హౌస్ గోదాం సిబ్బంది ఆందోళన

పొందూరు: జీతాల తగ్గింపును నిరసిస్తూ పొందూరు వ్యవసాయ మార్కెట్ ఆవరణంలోని వేర్‌హౌస్ గొడౌన్‌లో పనిచేస్తున్న సిబ్బంది శుక్రవారం ఆందోళన చేపట్టారు. గతంలో 20 మెట్రిక్ టన్నుల గొడౌన్‌ల వద్ద గార్డు కం ప్యూన్ (జిసిపి)లుగా 8 మంది పనిచేయగా రూ.8,500లు జీతంగా చెల్లించేవారు. జీతం పెంచకపోగా... ఇప్పుడు నలుగురికే జీతాలు చెల్లించేటట్లు వేర్‌హౌస్ అధికారులు నిర్ణయించడంతో ఆ జీతాలను ఎనిమిది మంది పంచుకోవాల్సి వస్తుందని అన్నారు. దీంతో గతంలో మాదిరిగా ఎనిమిది మందికి జీతాలు చెల్లించాలని, పనిబట్టి కాకుండా ప్రతినెలా జీతాం చెల్లించాలని కోరారు. అధికారుల ఆదేశాలు మేరకు మాత్రమే సిబ్బందికి జీతాలను చెల్లిస్తున్నట్లు గొడౌన్ మేనేజర్ రాధాకృష్ణ తెలిపారు.

జనావాసాల మధ్య టవర్ వద్దు

రణస్థలం/రూరల్: చుట్టూ జనావాసం నడుమ సెల్ టవర్ నిర్మాణం చేపట్ట వద్దని స్థానకులు ఆందోళన చేపట్టారు. రామతీర్థాల రోడ్డులో ఎంపిపి ప్రతినిధి చర్యలను నిరసిస్తూ ప్రజలు పెద్ద ఎత్తున శుక్రవారం నిరసనలు తెలిపారు. ఓ దుకాణానికి చెందిన ఇంటిపై సెల్ టవర్ నిర్మించుకునేందుకు టెలికాం యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వెంటనే స్థానికులు సంబంధిత అధికారులకు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అయినా సెల్ టవర్ నిర్మాణ పనులు చేపట్టడంతో స్థానికులు పెద్దఎత్తున చేరుకుని నిరసన తెలిపారు.

సాయిరాజ్ దృష్టికి వార్డు సమస్యలు

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు బ్రహ్మణవీధిలో ప్రధానంగా నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కౌన్సిలర్ ప్రతినిధి పరపటి కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి సాయిరాజ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జెఎసి కాలనీలో శ్మశాన వాటిక పనులు అర్ధరంతంగా నిలిచిపోయాయని, అదనపు నిధులు మంజూరు చేయమని కోరారు. వార్డులో కమ్యూనిటీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాలకు తారు రోడ్లు

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి తారు రోడ్లు నిర్మిస్తున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలో ఉన్న చిన్నబడాం నుంచి అంతరకుడ్డ వరకు రూ.70 లక్షల వ్యయంతో తారు రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామాలు సైతం అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్రతి వార్డులోనూ సిసి రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామని చెప్పారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా పనులు చేపట్టాలన్నారు. త్వరలో ఇంటింటికీ తాగునీరు అందించే కార్యక్రమం చేపడతామని


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ గిరిబాబు

అన్నారు. కార్యక్రమంలో హనుమంతు వెంకటరావు, వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, డబ్బీర్ నాగు, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, మున్సిపల్ డిఇఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి పంచాయతీలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి అన్నారు. కోటబొమ్మాళి 1,2 సచివాలయాలను శుక్రవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొటబొమ్మాళి జగనన్న కాలనీలలో ఇళ్లు నిర్మించని వారు వెంటనే నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక వేల లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితి ఉంటే వారి ఇళ్ల పట్ట రద్దు చేసి వారికి హుదూద్ ఇళ్లు ఇవ్వాలన్నారు. మధ్యలో నిలిచిపోన ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి వేగవంతానికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది రికార్డులను పరిశీలించి సమాయపాలనతో సచివాలయ సిబ్బంది విధులు నిర్వర్తించాలని సూచించారు. ఇటీవల జరిగిన జగనన్న సురక్ష


హాజరును పరిశీలిస్తున్న దువ్వాడ వాణి

కార్యక్రమంలో ఎన్ని ధ్రవపత్రాలు మంజూరు చేశారు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బోయిన నాగేశ్వరరావు, కొత్తమ్మతల్లి ఆలయ చైర్మన్ బోయిన కృష్ణారావు, జెసిఎస్ కన్వీనర్ నాగభూషణ్, పట్టుపురం ఎంపిటిసి బొడ్డు చెంచులు, సర్పంచ్ సంపతిరావు రమణ, కొత్తపేట సర్పంచ్ ప్రతినిధి శివారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు సర్వే వేగవంతం

జలుమూరు: మండలంలో చేస్తున్న ఓటర్ నమోదు సర్వే వేగవంతం చేయాలని తహశీల్దార్ బి.సత్యం సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఒలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటా ఓటరు నమోదు సర్వేలో వాలంటీర్లను భాగస్వాములను చేయరాదని హెచ్చరించారు. అన్ని పార్టీల నాయకులకు ముందుగా సమాచారం ఇచ్చి వారిని సర్వేలో భాగస్వాములు చేయాలన్నారు. సమావేశంలో ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ శరత్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ తిరుపతిరావు, పరిశీలకులు సతీష్ పాల్గొన్నారు.

పరిశీలన

మెళియాపుట్టి : గ్రామాల్లో బిఎల్ఒలు నిర్వహిస్తున్న ఓటరు నమోదు సర్వేను తహశీల్దార్ పి.సరోజని శుక్రవారం పరిశీలించారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం, పెద్ద జగన్నాథపురం గ్రామాల్లో ముమ్మరంగా సర్వే సాగుతుంది. ఓటరు నమోదులో ఎటువంటి లోపాలకు తావివ్వకుండా తగు సూచనలు అందించారు.


సభాస్థలిని పరిశీలిస్తున్న చిరంజీవి నాగ్

సభాస్థలి పరిశీలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను ఈ నెల 7న ప్రారంభిస్తామని వైసిపి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, బిసి సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలరావు పాల్గొంటారని అన్నారు. ఈ మేరకు కృషి విజ్ఞాన కేంద్రంలో సభాస్థలిని శుక్రవారం పరిశీలించారు. నియోజకవర్గానికి అధిక సంఖ్యలో విద్యా సంస్థలను తీసుకొచ్చిన ఘనత శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకే దక్కిందని అన్నారు. ఈయన వెంట బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పప్పల రమేష్ కుమార్ ఉన్నారు.


స్వీట్ తినిపిస్తున్న గోవిందరావు

శత్రుచర్ల జన్మదిన వేడుకల్లో 'ఎంజిఆర్'

పాతపట్నం: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం చినమేరంగి కోటలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయ రామ రాజు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ వేడుకల్లో పాతపట్నం టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈయన వెంట కురుపాం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి, శశికళాదేవి, ఎల్ఎన్‌పేట మండల మాజీ టిడిపి అధ్యక్షులు వెలమల గోవిందరావు, పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, గోకర్ణపురం సర్పంచ్ రవికుమార్ ఉన్నారు.

అధ్యాపకుల విరాళం

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా ఎం.బాలకృష్ణ, డాక్టర్ ఎ.శివప్రసాద్‌లు విధులు నిర్వహించి విశాఖపట్నంలోని కృష్ణా కళాశాలకు ఇటీవల బదిలీపై వెళ్లారు. కళాశాల అభివృద్ధికి వారు రూ.పది వేలు విరాళం ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మకు శుక్రవారం అందించారు. కళాశాల అభివృద్ధిలో భాగంగా ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విరాళం అందించిన అధ్యాపకుల స్ఫూర్తిని గోవిందమ్మ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బేపల సతీష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.


విరాళాన్ని అందజేస్తున్న అధ్యాపకులు

బదిలీ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలకు పాల్పడిన పూర్వ డిఇఒ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్యపై చర్యలు తీసుకోవాలని, బదిలీ ఉపాధ్యాయులను రెండు నెలల జీతాలు చెల్లించాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బదిలీల్లో తిరుమలచైతన్య నిర్లక్ష్య వైఖరి, బాధ్యతారాహిత్యం వల్ల ఉపాధ్యాయులకు, పాఠశాలలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. జరిగిన నష్టంపై 36 పేజీల నివేదిక విద్యాశాఖ కమిషనర్‌కు అందజేశామన్నారు. అయినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. మరోవైపు ఉపాధ్యాయులకు జీతాలు లేని దుస్థితి కల్పించారని ఆరోపించారు. కార్యక్రమంలో బి.రమణమూర్తి, సూర్యారావు, రమేష్, సన్యాసిరావు, రాజు అన్నాజిబాబు, రామచంద్ర, బి.రామారావు, చింతల రామారావు, శ్రీను పాల్గొన్నారు. అనంతరం డిఆర్‌ఒను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఇంటి పన్ను వసూలు ముమ్మరం

ప్రజాశక్తి- టెక్కలి

జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకానికి సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ విస్తరణాధికారి ఐ.వి.రమణ అన్నారు. కార్యాలయంలో టెక్కలి, పలాస మండలాల పంచాయతీ విస్తరణాధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షాపుల నుంచి చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, ఇకెవైసి తదితర అంశాలపై ఆంశాలపై కార్యదర్శులు దృష్టి సారించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు.


మాట్లాడుతున్న రమణ

సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలన్నారు. సచివాలయ సిబ్బంది భాగస్వామ్యంతో గ్రామాల్లో క్లోరినేషన్ పనులు చేపట్టాలని కోరారు. సమావేశంలో డిపిఆర్‌సి పేరాడ ఆనందరావు, ప్రసాద్, మెహీద్దీన్, కార్యదర్శులు పాల్గొన్నారు.


బెడ్ షీట్లు వేస్తున్న భవానీశంకర్

ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వ చర్యలు చేపడుతుందని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్ అన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు ఐటిడిఎ నిధులు రూ.1.29 లక్షలు విలువ చేసే రోగుల మంచాలపై వేసే బెడ్ షీట్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 364 రోగుల మంచాలపై బెడ్ షీట్లు అందజేశామని చెప్పారు. రోగులు వాడిన బెడ్ షీట్లను ఎప్పటికప్పుడు మార్చాలని సిబ్బందికి సూచించారు. బెడ్ షీట్లు మార్చడం ద్వారా రోగులు త్వరగా కోలుకుంటారని, మరోవైపు రోగాలు బారిన పడకుండా చూసుకోవచ్చు అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నాడు-నేడు నిధులతో ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన, వైద్యులు కూర్మారావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వర్‌తో సమస్యలు

ప్రజాశక్తి- కవిటి

రేషన్ పంపిణీలో నిరంతరం సర్వర్ మొరాయిస్తుండడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ప్రస్తుతం పొలం పనుల సీజన్ కావడంతో సర్వర్ సహకరించక పంపిణీలో ఆలస్యం అవుతుందని ఎండియు ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహశీల్దార్ టి.రామచంద్రరావుకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. అనంతరం వీరు మాట్లాడుతూ రేషన్ పంపిణీకి కొద్ది నెలలుగా రెండు తంబులు (పంచదారకు ఒకటి, బియ్యంకు ఒకటి) ఏర్పాటు చేయడంతో తమకు కష్టాలు మొదలయ్యాయని అన్నారు. మొదటి తంబు పడినా రెండో తంబు పడేందుకు చాలా సమయం


వినతిపత్రం అందజేస్తున్న ఎండియు ఆపరేటర్లు

పడుతుందని తెలిపారు. కొన్ని సందర్భాల్లో గంటకు రెండు, మూడు కార్డులకు కూడా రేషన్ పంపిణీ చేయడం కష్టంగా ఉందని వాపోయారు. దీనికి తోడు నిరంతరం సర్వర్ సమస్య ఏర్పడుతోందని అన్నారు. కార్యక్రమంలో ఎండియు ఆపరేటర్లు దేవరాజు, కాళీ, లోకనాథం, అశోక్, శంకర్, లోకేశ్వరరావు, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.


ద్రవ జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

ద్రవ జీవామృతం తయారీ

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని వేల్పురాయిలో మండల స్థాయి పొలంబడి కార్యక్రమం మండల ఎఒ వ్యవసాయాధికారి విజయభాస్కర్ ఆధ్వర్యాన ద్రవ జీవామృతం శుక్రవారం తయారు చేశారు. ఈసందర్భంగా రైతులకు వరి పొలంలో సస్య రక్షణ పద్ధతి గురించి వివరిస్తూ చీడపీడలపై పురుగులు, తెగులుపై రైతులు అవగాహన కల్పించారు. రసాయని ఎరువులు, పురుగు మందులు తగ్గించి అన్నారు. భూమి సారం కోసం రైతులు ఘన ద్రవ జీవామృతాలు వినియోగించాలన్నారు. ఒక ఎకరా పొలానికి 200 లీటర్ల డ్రమ్ములో రెండు కేజీల బెల్లం, రెండు కేజీల సెనగపిండి, పదిలీటర్ల ఆవు మూత్రం, 10 కేజీల పేడ,గుప్పెడు మట్టి ఈ మోతాదులను ఒక డ్రమ్ములో కలిపి వారం రోజులు ఉంచి పొలానికి 20 రోజులు ఒకసారి వేస్తే భూమి బాగా సారవంతం అవుతుంది అన్నారు. పంటకు చీడ పీడలను తట్టుకునే శక్తి వస్తుందని రైతులకు సూచించారు. కార్యక్రమంలో విఎఎలు ప్రశాంత్, రవి, వెంకట్ రమణ, ప్రకృతి వ్యవసాయ ఎస్‌డిఎజి రాంబాబు, సూర్యారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మణిపూర్ ఘటనలపై నిరసన

ప్రజాశక్తి- రణస్థలం

మణిపూర్ సంఘటనలపై మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ మేరకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డిటి శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు భవిరి ప్రదీప్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్ సంఘటనల బాధ్యులపై కఠన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు చెందిన నాయకులు పెద్దలు పాల్గొన్నారు.

విఒలకు శిక్షణ

ప్రజాశక్తి- పలాస

గ్రామాల్లో మహిళా సంఘాలు పుస్తక నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని వెలుగు ఎపిఎం మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక స్త్రీ నిధి భవనంలో శుక్రవారం వెలుగు సిబ్బంది, డ్వాక్రా సంఘాల విఒలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణాలు ఎలా పొందాలి, ఎలా నిర్వహించుకోవాలి, చెల్లింపులు, డాకుమెంట్స్ తయారు చేయడం ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, సబ్ కమిటీ వారితో అప్రూవల్ చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. ఆర్థిక నిర్వహణలో రుణాలను జీవనోపాధులకు ఉపయోగించి అధికంగా ఆదాయాన్ని సంపాదించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌సి సాహు, ఎపిఎం అప్పలనరసమ్మ, అకౌంటెంట్ కళ్యాణి, కంప్యూటర్ ఆపరేటర్ రామారావు పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని సీనియర్ ఐఎఎస్ అధికారులు సందర్శించారు. శుక్రవారం ఉదయం జగనన్న భూహక్కు భూ రక్ష స్పెషల్ ఆఫీసర్ బి.సుబ్బారావు సతీసమేతం, ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తన కుమార్తెతో కలిసి అరసవల్లిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామి వారికి నిర్వహించిన పలు సేవల్లో వారు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో ఇఒ వి.హరిసూర్యప్రకాష్ స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

పాలవలసలో వైద్య సేవలు

బూర్జ : మండలంలోని పాలవలసలో వైద్యాధికారి పావని ఆధ్వర్యాన శుక్రవారం 104 వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎంఎల్‌హెచ్ పి.అలేఖ్య, సూపర్‌వైజర్ టి.తేజ, ఎఎన్ఎం చిన్నమ్మడు, హెల్త్‌అసిస్టెంట్ ముఖలింగం పాల్గొన్నారు.


క్యూలో ఉన్న ప్రజలు

ఒక్క రోజుకే పరిమితం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక రైతుబజారులో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, రైతుబజారు అధికారులు గురువారం అట్టస్యం ప్రారంభించిన సబ్సిడీపై ప్రజలకు అందించిన టమాటా ఒక్క రోజేకే పరిమితమైంది. ఇక నుంచి రోజూ టమాటా రేటు తగ్గినంతవరకూ రైతుబజారు ద్వారా టమాటా సబ్సిడీపై రూ.50లకు అందజేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పారు. కానీ, ప్రారంభించిన సాయంత్రానికే స్టాక్ అయిపోవడంతో సిబ్బంది చేతులెత్తేశారు. ఇది తెలియని ప్రజలు శుక్రవారం ఉదయం 9 గంటలకే రైతు బజారుకు చేరుకొని టమాటా కోసం క్యూకట్టారు. 11 గంటలకు వచ్చిన రైతు బజారు అధికారులు, సిబ్బంది వచ్చిన స్టాక్ ఆ రోజే అయిపోయిందని చెప్పారు. దీంతో లబ్ధిదారులు తెల్లముఖాలు వేసుకొని వెనుతిరిగారు.